

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు17: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా అక్టోబర్ 2024లో నిర్వహించబడే పబ్లిక్ పరీక్షల కోసం అభ్యర్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ రుసుముతో ఆగస్టు 22 నుంచి 30 వరకు, రూ.25 అపరాధ రుసుముతో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 4 వరకు, రూ.50 అపరాద రుసుముతో సెప్టెంబర్ 5 నుంచి 9 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పరీక్ష ఫీజును టిఎస్ఆన్‌లైన్/మీ సేవా కేంద్రాలలో చెల్లించాలని తెలిపారు.

- జిల్లాలో 5లక్షల ఎకరాలు దాటిన సాగు
- జూలై వర్షాలతో పెరిగిన విస్తీర్ణం
- వరి సాగుకే మొగ్గు చూపిన రైతులు
- వరి తర్వాత ఆరుతడి పంటలదే పైచేయి
- గతం కంటే పెరిగిన మొక్కజొన్న
- ధర పెరిగినా పసుపు వైపు చూడని రైతులు



భారీగా పెరిగిన సాగు విస్తీర్ణం!

నిజామాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వానాకాలం సాగు సాగు విస్తీర్ణం 5 లక్షల ఎకరాలు దాటింది. వర్షాలు కురవడం, కరెంటు అందుబాటులో ఉండటంతో రైతులు పెద్దఎత్తున పంటలు సాగుచేస్తున్నారు. ఆరుతడి పంటలతోపాటు వరిసాగుకే రైతులు మొగ్గు చూపారు. జిల్లా వ్యాప్తంగా పంటల సాగుపై వ్యవసాయ అధికారులు క్లస్టర్ల వారిగా వివరాల ను సేకరిస్తున్నారు. సర్వే నంబర్ ఆధారంగా విస్తీర్ణాన్ని నమోదుచేస్తున్నారు. ప్రభుత్వం సన్నరకాల ధాన్యానికి బోనస్ ప్రకటించడంతో వరిసాగు మొత్తం విస్తీర్ణంలో 75శాతానికి పైగా జిల్లాలో పెరిగింది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో సాగు కూడా పెరిగింది. కూలీల అవస రం తక్కువగా ఉండటం, దిగుబడి కూడా ఎక్కువ మొత్తంలో వస్తుండటం పండిన ధాన్యాన్ని ప్రభుత్వంతోపాటు వ్యాపారులు కూడామద్దతు ధరకు కొనుగోలు చేయడంతో రైతులు ఈ సాగుకు మొగ్గుచూపారు. ఖర్చు తక్కువగా ఉండటంతో ప్రతీ ఏడాది వరి విస్తీర్ణం పెంచుతున్నారు. జిల్లాలో వరి సాగు పెరగడంతో వ్యవసాయ శాఖ అధికారులు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారు.

5లక్షలు దాటిన సాగు విస్తీర్ణం

జిల్లాలో పంటల సాగు ఐదులక్షల ఎకరాలను దాటింది. జూలై నుంచి వర్షా లు ఎక్కువగా పడటం వల్ల రైతులు ఎక్కువ మొత్తంలో పంటలను వేశారు. జిల్లాలో సరాసరి సగటు వర్షపాతం కన్న ఎక్కువగా పడటంతో ఆరుతడి పంటలతోపాటు వరిసాగును చేశారు. ఈ ఏడాది జిల్లాలో భారీ వర్షాలు పడకున్నా పంటలకు అవసరమైన రీతిలో వర్షాలు కురుస్తున్నాయి. కొన్నిమండలాల పరిధిలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడుతుండటంతో అన్ని మండలాల పరిధిలో సరాసరి సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటివరకు 574.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 640.5 మిల్లీ మీటర్ల వర్షం పడింది. అన్ని మండలాల పరిధిలో ఈ వర్షం పడటం వల్ల భూగర్భ జలాలు కూడా పెరగడంతో సాగు ఎక్కువగా పెరిగింది. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేయడంతో బోధన్ డివిజన్ పరిధిలో ముందుగానే రైతులు నాట్లను వేశారు. జూలై ఆరంభంలోనే నీటిని విడుదల చేయడంతో ఎక్కువ మొత్తంలో వరి సాగు చేశారు. జూలై నెలలో వర్షాలు పడటం చివరి వారంలో ఎక్కువ పడటం వల్ల వరినాట్లను జిల్లా అంతటా రైతులు వేశారు. శ్రీరాంసాగర్‌కు కూడా నీళ్లు రావడం, కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడంతో వరిసాగు పెరిగింది.

జూలై వర్షాలతో పెరిగిన పంటల సాగు

జిల్లాలో జూన్ ఆరంభంలో వర్షాలు తక్కువగా పడినా జూలైలో ఓ మోస్తారు నుంచి కొన్ని మండలాల పరిధిలో భారీ వర్షం కురవడంతో పంటల సాగు పెరిగింది. జిల్లాలో ఈ వానాకాలంలో 5లక్షల 52వేల 128 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. జిల్లాలో ఇప్పటివరకు 5లక్షల 2వేల 714 ఎకరాల్లో రైతులు పంటలను సాగుచేశారు. జిల్లా వ్యవసాయ శాఖ నిర్ణయించిన లక్ష్యంలో సరాసరి 93 శాతానికి పైగా పంటలు సాగు అయ్యాయి. ఈ వానాకాలంలో జిల్లాలో అత్యధికంగా రైతులు వరిసాగుకే మొగ్గు చూపారు. పెట్టుబడి తక్కువగా ఉండటం గత కొన్నేళ్లుగా ధాన్యం దిగుబడి కూడా పెరగడం వల్ల ఎక్కువ మంది రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటలైన పసుపు, మిర్చికి మొగ్గు చూపకుండా మెజార్టీ రైతులు వరిసాగునే చేపట్టారు. మొక్కజొన్న, సోయా పంటలకు కూడా తక్కువ ఖర్చు ఉన్న రైతులు ఎక్కువ మొత్తంలో వరిసాగు చేపట్టారు. గత కొన్నేళ్లుగా సోయా పంట దిగుబడి తగ్గడం, కోసే సమయంలో వర్షాలు భారీగా పడటం వల్ల పంట దెబ్బతింటుంది. అప్పటినుంచి రైతులు సోయా పంటను తగ్గించి వరిసాగును చేస్తున్నారు.

3.93 లక్షల ఎకరాల్లో వరి

జిల్లాలో 4లక్షల 30వేల 550 ఎకరాల్లో వరిపంట సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా ఇప్పటివరకు 3లక్షల 93వేల 404 ఎకరాల్లో వరిసాగును చేశారు. జిల్లాలో పంటల సాగు అయ్యే మొత్తం విస్తీర్ణంలో 75శాతానికి పైగా వరిసాగును చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వరిలో కొత్త రకాలు రావడం గత కొన్నేళ్లుగా ఎకరాకు 28 నుంచి 32 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండటంతో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. మిగతా పంటలకంటే పెట్టుబడి తక్కువగా ఉండటం కూలీల అవసరం కూడా అంతంత మాత్రంగానే ఉండటం వల్ల ఈ పంట సాగుపెరిగింది. జిల్లాలో సాగైన వరి విస్తీర్ణంలో 65 శాతానికి పైగా సన్నరకాలు సాగుచేశారు. ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఈ సాగును ఎక్కువగా చేస్తున్నారు. సన్నరకం ధాన్యాలకు డిమాండ్ ఉండటం, ఇతర రాష్ట్రాల వారు వచ్చి ధాన్యాన్ని మద్దతు ధరకు మించి కొనుగోలు చేయడం వల్ల రైతులు ఎక్కువ మొత్తంలో ఈ పంటలు వేశారు. వ్యాపారులు కొనుగోలు చేయకున్నా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయడం, మద్దతు ధరకు మించి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఈ సాగును చేపట్టారు.

బోనస్ ప్రకటనతో పెరిగిన వరి సాగు

ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సన్నరకాల సాగు ఎక్కువైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో వరితోపాటు ఈ ఏడాది మొక్కజొన్న సాగు కూడా ఎక్కువగా చేశారు. జిల్లాలో 44వేల 855 ఎకరాల్లో ఈ పంటను వేశారు. గత ఏడాది కంటే 20శాతం అధికంగా ఈ పంటను సాగుచేశారు. జిల్లాలో సోయా 35వేల 279 ఎకరాల్లో వేశారు. గత సంవత్సరం కంటే 50శాతం ఈ పంటను రైతులు తక్కువగా వేశారు. పసుపునకు భారీగా డిమాండ్ వచ్చినా రైతులు సాగును ఎక్కువ మొత్తంలో పెంచలేదు. జిల్లాలో 25వేల 744 ఎకరాల్లోనే పసుపు సాగు చేస్తున్నారు. పెరుగుతున్న పెట్టుబడి, అవసరమైన లేబర్ కొరతతో సాగును తగ్గించినట్లు తెలుస్తోంది. ఈ పంటలతోపాటు కంది, పెసర, మినుములతో పాటు కూరగాయల సాగును కొనసాగించారు. జిల్లాలో సాగైన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్లస్టర్ల వారిగా సర్వే చేశారు. వివరాలను ప్రభుత్వానికి పంపిస్తున్నారు. జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని జేడీఏ వాజిద్ హుస్సేన్ తెలిపారు. సాగు విస్తీర్ణం పెరగడం వల్ల రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు.



జిల్లాలో వ్యవసాయ అధికారుల బదిలీలు

- బదిలీ అయినవారి స్థానంలో ఏవోల నియామకం

నిజామాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పనిచేస్తున్న మండల వ్యవసాయ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ఉత్తర్వులను జారీచేశారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడగానే ఆయా మండలాల పరిధిలో కొత్త వ్యవసాయ అధికారులు చేరారు. వీరితో పాటు జిల్లాలో పనిచేస్తున్న పలువురు వ్యవసాయ ఎక్స్‌టెన్షన్ అధికారులను కూడా బదిలీ చేయడంతో వారు చేరారు. జిల్లా జేడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న టెక్నికల్ ఏవో శ్రీకర్‌ను బాసరకు బదిలీచేశారు. ఆయన హెడ్‌క్వాటర్ టెక్నికల్ ఏవోగా పలు సంవత్సరాలు పనిచేశారు. కీలకమైన నిర్ణయాలు అమలుపర్చారు. కొత్తసాంకేతిక పరిజ్ఞానం అమలుతోపాటు రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశారు. భీంగల్‌లో పనిచేస్తున్న ఏ.రాజ్‌కుమార్‌ను జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ఏవోగా బదిలీచేశారు. నిజామాబాద్ రూరల్ ఏవోగా పనిచేస్తున్న అబ్దుల్ మాలిక్‌ను మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల ఏవోగా బదిలీచేశారు. నిజామాబాద్ రూరల్ ఏడీఏ పరిధిలో సిరికొండ ఏవోగా పనిచేస్తున్న జాడి వెంకటేశ్‌ను ధర్పల్లికి బదిలీచేశారు. మోర్తాడ్‌లో పనిచేస్తున్న బద్దం లావణ్యను బాల్కొండ ఎంఏవోగా బదిలీ చేశారు. నవీపేటలో పనిచేస్తున్న ఏవో జె.సురేష్‌గౌడ్‌ను జెడిఏ ఏవో టెక్నికల్‌గా బదిలీ చేశారు. డిచ్‌పల్లి ఏవోగా పనిచేస్తున్న గాలి రాంబాబును ఆలూరు ఏవోగా బదిలీ చేశారు. బాల్కొండ ఏవోగా పనిచేస్తున్న సాదుల మహేందర్‌ను నిజామాబాద్ ఏడిఏ పరిధిలో టెక్నికల్ ఏవోగా నియమించారు. నిజామాబాద్ ఏడిఏ పరిధిలో ఏవో టెక్నికల్‌గా ఉన్న డి.సౌమ్యను మోపాల్ ఏవోగా బదిలీ చేశారు. జెడిఏలో పనిచేస్తున్న ఏవో ఎం.సుధామాధురిని డిచ్‌పల్లి ఏవోగా బదిలీ చేశారు. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బదిలీ అయిన ఏవోలు శనివారం రోజు ఆయా మండలాల పరిధిలో చేరారు. జిల్లాలో పనిచేస్తున్న క్లస్టర్ ఏఈవోలు బదిలీ కావడంతో వారు కూడా కేటాయించిన మండలాల్లో చేరారు.

నగరంలో మున్సిపల్ కమిషనర్ తనిఖీలు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మంద మకరంద్

సుభాష్‌నగర్, ఆగస్టు 17: నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. నగరంలోని జోన్-2 కార్యాలయంలో శనివా రం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోని హాజరుపట్టికను పరిశీలించారు. సిబ్బంది హాజరు పై శానిటరి ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. గోల్‌హనుమాన్, పూలాంగ్ జోనల్ కార్యాలయాలను పరిశీలించారు. అంతేకాకుండా నగరంలోని అర్సపల్లి రైల్వేగేట్ గ్రావెల్ పనులను పరిశీలించి రోడ్లను బాగు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మోపాల్ మండలంలోని వాటర్ ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. నీటిలో బ్లీచింగ్ సరైన పద్ధతిలో కలుపుతున్నారా లేదా అని పరిశీలించారు. ఫిల్టర్‌బెడ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని కోరారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఫిల్టర్ బెడ్‌లో నీటిని తాగి పరిశీలించారు.

క్రమంగా పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

మెండోర, ఆగస్టు 17: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ వంశీ తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి ఉదయం 7,909 క్యూసెక్కుల వరద నీరు చేరగా.. మధ్యాహ్నం ప్రాజెక్టులోకి 13,015 క్యూసెక్కులకు వరద పెరిగింది. సాయంత్రానికి 15వేల320 క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు నుంచి వానాకాలం పంటల కోసం కాకతీయ, సరస్వతీ కాలువలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి లక్ష్మీ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 4200 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 522 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా, శనివారం సాయంత్రానికి 1081.2 అడుగులు (48.294 టీఎంసీ) నీటి నీల్వ ఉందని వివరించారు.



ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం



నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య సిబ్బంది

వైద్యురాలిపై అత్యాచారం చేసిన

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఓపీ సేవలు నిలిపివేసి వైద్యుల నిరసన
- మద్దతు తెలిపిన ప్రజా సంఘాలు

పెద్దబజార్, ఆగస్టు17: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు శనివారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మేరకు వైద్య సేవలను నిలిపివేసి ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ, మెడికవర్, మనోరమా, వెల్‌నెస్ సెంటర్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్, ప్రైవేటు ఆసుపత్రులతోపాటు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఓపీ సేవలను నిలిపివేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాల్గోరోజు ఆందోళన కొనసాగింది. ఈ సందర్భంగా భారతదేశ చిత్రపటంలో వైద్యురాలి చిత్రాన్ని వేసి నివాళులర్పించారు. జూడాలకు సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐటీఎఫ్, తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వారికి మద్దతు తెలిపాయి. వైద్యురాలిపై అత్యాచారం వైద్య రంగానికి తీవ్ర భయభ్రాంతులకు, అభద్రతకు గురిచేసిందని అలాగే క్రూరమైన చర్యతో యావత్ భారతదేశం దిగ్భ్రాంతికి గురైందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

అత్యాచార నిందితులను బహిరంగంగా శిక్షించాలని సీపీఐ కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని రైల్వే స్టేషన్ చౌరస్తాలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజరెడ్డి, రాజన్న, స్వరూపరాణి, రాందాస్, రఘురాం, అంజలి, ఇమ్రాన్, ఫిరోజ్ పాల్గొన్నారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని ధర్నాచౌక్ వద్దమద్దతు తెలిపి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ సుగుణాకర్, వైద్యులు ప్రతాప్, రోహిత్, భాస్కర్, సందీప్, అనిల్, రాజశేఖర్, కవిత, కార్తిక్, ఫణీంద్ర వివేక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ భూపతిరెడ్డి

ఐద్వా ఆధ్వర్యంలో..

డ్యూటీలో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లాకార్యదర్శి సుజాత డిమాండ్‌చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న డాక్టర్స్‌కు ఐద్వా ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అనిత, నగర నాయకులు వనజ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఆయూష్ ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి విభాగంలో గల ఆయూష్ సిబ్బంది బ్యాడ్జీలు ధరించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆయూష్ ఇన్‌చార్జి డాక్టర్ నారాయణరావు, ఫార్మసిస్టులు పురుషోత్తం, ఉమాప్రసాద్, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటన నింధితుడిని కఠినంగా శిక్షించాలి

అత్యాచార ఘటన నింధితుడిని కఠినంగా శిక్షించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఐఎంఏ అండ్ తానా వైద్యులు స్వచ్ఛందంగా ఓపీ సేవలు నిలిపివేసి ఐఎంఏ భవనంలో వైద్యురాలి ఆత్మకుశాంతి చేకూర్చాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలని, ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొట్టూరు శ్రీశైలం, తానా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేష్, ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్, మేఘన దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రతాప్ కుమార్, సీనియర్ వైద్యులు జయని నెహ్రూ, రామ్మోహన్‌రావు, సాంబశివరావు, హరిప్రసాద్‌రావు, కవితారెడ్డి, రమాదేవి, వినోద్‌కుమార్ గుప్త, కౌలయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనను విరమింపజేయాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని కోరుతున్న పోలీసులు



రైతులందరికీ రుణమాఫీ చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళా రైతులు

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద రైతుల ధర్నా
- 63వ జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

వేల్పూర్, ఆగస్టు17: ఎలాంటి షరతులు, కటింగ్‌లు లేకుండా బేషరతుగా రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేల్పూర్ క్రాస్ రోడ్డువద్ద బాల్కొండ నియోజకవర్గ రైతులతో కలిసి ఆయన పెద్దఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ప్లకార్డులు బేషరతుగా వెంటనే రుణమాఫీ అందరికీ చేయాలని, సీఎం డౌన్‌డౌన్, రైతుభరోసా ఇవ్వాలని తీవ్రస్థాయిలో నినాదాలు చేస్తూ వేల్పూర్ వద్ద 63వ జాతీయ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రుణమాఫీ కాలేదని రైతులు ఎంతో ఆవేదనతో రోడ్డెక్కారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను నమ్మించి మోసం చేశాడని విమర్శించారు. గాలిమాటలు మాట్లాడి రైతులను మళ్లీ మండల కార్యాలయం, కలెక్టరేట్ చుట్టూ తిప్పుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి చెప్పిన మాయ మాటలు నమ్మి కేసీఆర్‌ను కాదనుకున్నందుకు బాధపడుతున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులను మోసం చేసి రోడ్డు మీద కూర్చొబెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతును రాజును చేసేందుకు రైతువేదికలు కట్టిన ప్రభుత్వం కేసీఆర్‌దేనన్నారు. డిసెంబర్ 9 వరకు రుణమాఫీ అని చెప్పి మొదటిసారి, రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలో ప్రశ్నిస్తే వందరోజుల్లో మాఫీ చేస్తానని రెండోసారి మాట తప్పరన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి గెలిపిస్తే ఆరు గ్యారంటీలు, 13 హామీలు నెరవేరుస్తామని చెప్పి చేయలేదని, ఆగస్టు 15లోపు మాఫీ చేస్తామని, ఎక్కడ వెళ్లినా ఆ ప్రాంత దేవుళ్లపై ఒట్టువేసి చెబితే ప్రజలు నమ్మి ఓట్లు వేశారన్నారు. ఆగస్టు 16వరకు రుణమాఫీ లిస్ట్ ఇవ్వకుండా మాట తప్పరన్నారు. రాష్ట్రంలో 70లక్షల మంది రైతులు ఉంటే 60లక్షలమంది లోన్ తీసుకున్నారని, అందులో 44లక్షల మందికి కుటుంబానికి ఒకరి చొప్పున రూ.40 వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి రూ.31వేల కోట్లు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు మాత్రమే ఇచ్చి ఆగస్టు 15న రూ.17,900కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. మాఫీ కాని రైతులు ఎవరైన ఉంటే వారు మండల కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం పోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో రూ.22లోల మందికి రుణమాఫీ కాలేదన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 3లక్షల 79వేల మందికి రుణం తీసుకుంటే లక్షా 70వేల మందికి మాత్రమే మాఫీ చేశారన్నారు. మిగిలిన రెండు లక్షల 4వేల మంది రైతులకు కూడా మాఫీ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. జిల్లాకు రూ.1281కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. 2016లో కేసీఆర్ రూ.లక్షలోపు చేస్తే రూ.1571కోట్లు మాఫీ అయ్యాయని గుర్తుచేశారు. కేటీఆర్ చెప్పినట్టు సీఎం రేవంత్‌రెడ్డి మానసిక స్థితిపై ప్రజల్లో అనుమానాలున్నాయని అన్నారు. హరీశ్‌రావు చాలెంజ్ విసరడంతోనే ఈమాత్రం రుణమాఫీ చేశారన్నారు. అనంతరం మహిళా రైతులతో కలిసి రుణమాఫీపై వేల్పూర్ తహసీల్దార్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. అర గంటపాటు చేసిన రాస్తారోకోతో నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు వెళ్లే పయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, పోలీసులు భారీ బందోస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి నీరజ, నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.





కోటగిరిలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

కోటగిరి, ఆగస్టు 17: కోటగిరి మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ మందిరం సమీపంలో పైడి ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు శుద్ధమైన జలాన్ని అందించేందుకు తనవంతు సాయంగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు ఎల్లారెడ్డి, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు17: మండలంలోని తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే భక్తులు కొండపై చేరుకొని అనంతరం స్వామివారి పల్లకిని కొండపై చుట్టు ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వీడీసీసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉప్లూర్ పోచమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కమ్మర్‌పల్లి, ఆగస్టు 17: మండంలోని ఉప్లూర్ గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణ నిమిత్తం సరసం గంగారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తమవంతుగా రూ.లక్ష విరాళాన్ని వీడీసీ సభ్యులకు డాక్టర్ సరసం రాజేశ్వర్‌రెడ్డి, న్యాయవాది సరసం చిన్నారెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సోమ దశరత్, పాలకవర్గ సభ్యులు కొమ్ముల రవీందర్, వన్నేల రాజేశ్వర్, బద్దం ధన్‌రెడ్డి, బద్దంనగేష్‌రెడ్డి, బద్దం మోహన్‌రెడ్డి, చింతకుంట శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.







నిందితులను కఠినంగా శిక్షించాలి

బోధన్‌రూరల్,ఆగస్టు17: కోల్‌కత్తా ఆర్‌జీఆర్ వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యార్థినిపై హత్యాచారం జరిగిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని బోధన్‌లో డాక్టర్ల ఆధ్వర్యంలో బోధన్ ఆసుపత్రి ఎదుట వైద్యులు,వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి హేయమైన ఘటనలను భవిష్యత్‌లో నిరోధించేందుకు కేంద్రం రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. లేదంటే ఇలాంటివి తరుచు పునరావృతం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎర్రకోటపై జెండా ఎగురవేసిన రోజే వైద్యులపై గుండాల గుంపు దాడి చేసిందని పేర్కొన్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బోధన్ ఆసుపత్రిలో పోలీస్ ఓట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులున్నారు. ప్రైవేటు మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో పట్టణంలోని ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లు మూసి వేసి మృతి చెందిన వైద్యురాలికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీపీఎంపీ అసోసియేషన్ నాయకులు యాదా చారి, కారం స్వామి,హన్మాండ్లు, రియాజ్, శ్రీనివాస్, బాలరాజు, శివన్నారాయణ, రఘు, తదితరులు పాల్గొన్నారు.

● పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 17: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య నింధితులను వెంటనే ఉరి తీయాలని కోరుతూ ఏబీవీపి ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని కంఠేశ్వర్ వద్ద ర్యాలీ నిర్వహించి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఇందూర్ విభాగ్ కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ బెంగాల్ రాష్ట్రంలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేయడం బాధాకరమని ఆ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నింధితులను వెంటనే ఉరి తీయాలని ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం పదవికి మమత బెనర్జి రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సునీల్, దాస్, అలంకార్, మహేష్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.


బోధన్ ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

● కోటగిరిలో నల్లబ్యాడ్జీలు ధరించి డాక్టర్‌ల నిరసన

కోటగిరి: ఇటీవల కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి నిరసనగా శనివారం కోటగిరి పీహెచ్‌సీ ఎదుట వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుప్రియ, ఏఎన్‌ఎం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటలు ఓపీ సేవలు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్య అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ శనివారం నిజామాబాద్ జిల్లా వైద్య అధికారుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ హాస్పిటల్‌లో ఓపీ సేవలు బంద్ నిర్వహించడం జరిగిందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఒక యువ పీజీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసినందుకు నిరసనగా ఐఎంఏ డాక్టర్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ధర్పల్లి: కోలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య కు నిరసనగా మండల కేంద్రంలోగల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బాధితురాలి కు టుంబానికి న్యాయం జరగాలని వైద్యులకు ప్రభుత్వాలు అన్ని రకాల రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. దోషులను ప ట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సుశాంత్, మౌనిక, నర్సింగ్ ఆఫీసర్ శాంత మ్మ, రమేష్, మమత, వసంత, జయ, లక్ష్మి, జయలక్ష్మి, వాజిద్, సంతోష్, నరేందర్, మల్లేష్, లత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:కోల్‌కత్తా హత్యచార ఘటన నిరసిస్తు 24గంటలు ఐ ఎంఏ ఆందోళనకు పిలుపునివ్వగా శనివారం డిచ్‌పల్లి మూప్పై పడ కల ఆస్పత్రి ఎదుట ఆస్పత్రి సిబ్బంది నల్లబ్యాడ్జీలతో ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డా.సందీప్ మాట్లా డుతూ.. వైద్య సిబ్బందిపై దాడులను కట్టడి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, వైద్యుల పనిగంటలు పరిస్థి తుల నేపథ్యంలో దాడులు జరగడం అమానుషనమన్నారు.

పోడు భూముల పంపిణీపై సమగ్ర వివరాలు అందించండి

● రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ● మంత్రి సీతక్కతో కలిసి ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 17:పోడు భూముల పంపిణీకి సంబంధించి సమగ్ర వివరాలను అందించాలని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి శనివారం మంత్రి కొండా సురేఖ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాల్లో ఇప్పటి వరకు పోడు పట్టాల కోసం వచ్చిన క్లెయిమ్‌లు ఎన్ని, వాటిలో ఎంత మందికి ఎన్ని ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేశారు, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి అందుకు గల కారణాలు ఏమిటి, పట్టాలు పొందిన వారికి భూమి హద్దులు చూపించారా, తదితర వివరాలను ఒక్కో జిల్లా వారిగా మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు రెండు విడతలుగా రాష్ట్రంలో పోడుపట్టాల పంపిణీ జరిగినప్పటికీ ఇంకా పలుచోట్ల గిరిజనుల నుంచి వినతులు వస్తున్నాయని అన్నారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన కుటుంబాలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని దీన్ని దృష్టిలో పెట్టుకొని పోడుభూముల పట్టాల పంపిణీకి సంబంధిత పూర్తి వివరాలను గడువులోగా పంపించాలన్నారు. వీటిపై ముఖ్యమంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని పోడు భూములకు సంబంధించి భవిష్యత్తులో మళ్లీ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎక్కడ కూడా అటవీభూముల ఆక్రమణ, చెట్ల నరికివేత జరుగకుండా పర్యవేక్షణ చేయాలని, అడవుల నరికివేత వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలందరిలో అవగాహన పెంచేందుకు విస్తృతస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిరికొండ మండలం రావుట్లలో అటవీభూమిని కొంత మంది యదేచ్ఛగా చెట్లు నరికివేసి కబ్జాలకు పాల్పడుతున్నారని వీసీలో పాల్గొన్న సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మంత్రికి ఫిర్యాదు చేశారు. తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు స్పందిస్తూ వెంటనే అదనపు కలెక్టర్‌ను పంపించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపిస్తామని సమగ్ర వివరాలతో నివేదిక పంపిస్తామన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఏడు మండలాలల్లో పోడు భూముల సమస్య ఉందని అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

సిరికొండ ఆగస్టు 17 : పంట రుణాలు తీసుకున్న రైతులందరికి ఆంక్షలు లేకుండా రుణ మాఫీని వర్తింప చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సిరికొండలో జరిగిన కార్యకర్తల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ మూడు దఫాలు అమలు చేసిన రుణ మాఫీ జరిగినప్పటికి చాలా మంది రైతులకు మాఫీ కాలేదని అన్నారు. రుణ మాఫీ కాని రైతులు ప్రతి రోజు బ్యాంకులు, సహకార సంఘాలు, వ్యవసాయ కార్యలయాల చుట్టు తిరుగుతున్న వారికి సరియైన సమాచారం దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.

నవీపేట: అర్హులైన రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలి బీజేపీ మడల అధ్యక్షులు సరిన్ కోరారు. శనివారం మండలంలోని జన్నేపల్లి కెనరా బ్యాంకు మేనేజర్ మధును పలువురు రైతులతో కలిసి మాట్లాడారు. జన్నేపల్లి కెనరా బ్యాంకులో అర్హులైన చాలా మంది రైతులకు రుణ మాఫీ వర్తించకపోవడం శోచనీయమని అన్నారు. వెంటనే సంబంధిత రైతులందరికీ రుణమాఫీ వర్తించే విధంగా చూడాలని లేనట్లయితే బ్యాంకు ఎదుట ఆందోళన చేపడతామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆదినాథ్, ప్రదీప్, గంగాధర్; సాయిలు, తదితరులున్నారు.

ఆర్మూర్‌రూరల్ : ఆలూర్ మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు (సిండికేట్ బ్యాంక్) ఎదుట శనివారం రైతులు బైటాయించి ధర్నా నిర్వహించారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్లనే రైతులకు రుణమాఫీ జాబితాలో తమ పేర్లు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారుల తప్పిదానికి తమను బలి చేయడం ఎంత వరకు సమంజసమని రైతులు నిలదీశారు. కెనరా బ్యాంకు పరిధిలో ఆలూర్, దేగాం, మచ్చర్ల, కల్లెడి, గుత్ప గ్రామాలకు చెందిన రైతులకు ఖాతాలు ఉన్నాయి. సుమారు 2500మంది రైతులకు ఖాతాలు ఉండగా, వారు వ్యవసాయ రుణాలు తీసుకున్న ఇందులో కేవలం 500మంది రైతులకే రుణమాఫీ రాగా మిగత రైతులకు జాబితాలో పేర్లు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. రుణాలు పొందిన ఖాతాదారుల డేటాను బ్యాంకు అధికారులు సరిగ్గా పంపకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. గత ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికి రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడారు. అందరికి రుణమాఫీ చేస్తానని ఇందుకు ప్రభుత్వం రూ.30వేల కోట్లు కేటాయించిందని అన్నారు. అనంతరం బ్యాంకు అధికారులతో మాట్లాడారు. ఇలా ఉండగా తాము ఖాతదారుల డేటాను సక్రమంగానే పంపామని, తమ వద్ద ఏలాంటి లోపం తలెత్తలేదని రైతులకు వివరించారు. రుణమాఫీ రాకపోవడంలో తమ బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంలేదని, ప్రభుత్వమే చేయాల్సి ఉందన్నారు. రుణమాఫీ కానీ రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని వివిధ గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్మూర్ సీఐ రవికుమార్ రైతులతో మాట్లాడి ధర్నా విరమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : ప్రభుత్వం మూడు విడతల్లో చేపట్టిన రుణమాఫీపై రైతులు నిరసనలు వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో రైతులు మాట్లాడుతూ మండలంలో సగానికి పైగా రైతులకు రుణమాఫీ వర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 15న రెండు లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ ప్రకటించిన ప్రభుత్వం అందులో అర్హులైన రైతుల పేర్లు లేవని వారు విమర్శించారు.

జిల్లాలో 15 మంది ఏవోల బదిలీలు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 17 : జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలోని 15 మంది వ్యవసాయశాఖ అధికారులను బదిలీచేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. నాగిరెడ్డిపేట ఏవోగా ఉన్న జి.విజయశంకర్ నిజామాబాద్‌కు బదిలీఅయ్యారు.ఎల్లారెడ్డి ఏవో ఎస్.హరిష్‌కుమార్ నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్‌కు బదిలీ అయ్యారు.కామారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవోగా ఉన్న నర్సింలు తాడ్వాయి ఏవోగా బదిలీకాగా బాన్సువాడ ఏవోగా ఉన్న జి.నరేందర్‌ను బీబీపేటకు బదిలీ చేశారు. కామారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవోగా ఉన్న టి.రమ్యశ్రీని నిజామాబాద్‌కు బదిలీచేశారు. కామారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న సుమితరాణిని రాజంపేట ఏవోగా,మాచారెడ్డి ఏవో ఎస్.బాల్‌రెడ్డిని మెదక్ జిల్లా హవేళిఘనపూర్ ఏవోగా, బోపాస్‌పల్లి వ్యవసాయకేంద్రం ఏవోగా ఉన్న సుధాకర్‌ను వరంగల్‌కు బదిలీచేశారు .కామారెడ్డి ఏవోగా శ్రీనివాస్‌రావును పాల్వంచ ఏవోగా,పిట్లం ఏవో కృష్ణను పెద్దకొడప్‌గల్ ఏవోగా,జుక్కల్ ఏవో నవీన్‌కుమార్ నిజామాబాద్ జిల్లాలోని నవీపేట ఏవోగా,తాడ్వాయి ఏవో బీ.శ్రీకాంత్‌ను నిజామాబాద్‌లోని ఇందల్‌వాయి ఏవోగా, దోమకొండ ఏవో పవన్‌కుమార్‌ను కామారెడ్డి ఏవోగా,ఎల్లారెడ్డి ఏవో సంతోష్‌కుమార్‌ను జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం ఏవోగా బదిలీచేశారు. బీర్కూర్ ఏవో కమలను పిట్లం ఏవోగా బదిలీచేశారు.

'రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పనిచేస్తోంది'

ఖిల్లా, ఆగస్టు17 :రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రతి సొసైటీ కేంద్రాల్లో రైతు సేవా కౌంటర్లను ఏర్పాటు చేస్తుందని, ఒకే సారి రైతులకు రూ2లక్షల రుణమాఫి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఇందూరు జిల్లా కేంద్ర సహకార సొసైటి(డిసిఎంటీ చైర్మన్ తారచంద్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడగానే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫి చేస్తామని చెప్పిన ప్రకారం రైతులకు మూడు విడతల్లో రైతు రుణమాఫి చేయడం జరిగిందన్నారు. రుణమాఫీ రాని వారి కోసం ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ నిలచిపోయిందన్నారు. అటువంటి రైతులు తిరిగి ధరఖాస్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని పేర్కొన్నారు.సన్న, చిన్నకారు వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించడానికి కృషి చేస్తుందన్నారు. రైతుల కోసం రైతుభరోసాతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయనున్నామన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్లు నాగేశ్వర్‌రావ్, శేఖర్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీధర్, రాంచందర్‌గౌడ్‌లు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

మోస్రా,ఆగస్టు17: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో శనివారం ఉదయం రైతులు పొలాలకు వెళ్లగా మూడు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఉన్నాయని స్థానిక ఏఈకి తెలియపర్చగా ఆయన పరిశీలించారు. మూడు చోట్ల మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్‌ను దొంగిలించారని ఏఈ మిథున్ తెలిపారు. జరిగిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆయన అన్నారు.

ఇసుక తరలించిన ఒకరిపై కేసు

కోటగిరిఆగస్టు17: పొతంగల్ మంజీర నది సమీపంలో ఇసుక డంప్‌ను తహసీల్దార్ మల్లయ్య నాలుగు రోజుల క్రితం సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను పొతంగల్ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి అక్రమంగా తరలించుకుపోయారని తహసీల్దార్ తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి టీఎస్16ఈహెచ్4696 అనే నెంబర్ గల జేసీబీని స్వాధీనం చేసుకోవడంతో పాటు యాజమాని రాజుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు జేసీబీని స్వాధీనం చేసుకోవడంతో పాటు యాజమానిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఉరేసుకొని మహిళ మృతి

ధర్పల్లి, ఆగస్టు 17: మండలంలోని ఒన్నాజిపేట్ గ్రామానికి చెందిన మిద్దెల లక్ష్మి (59) ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ శనివారం తెలిపారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరివేసుకొని చనిపోయినట్లు ఆయన చెప్పారు. లక్ష్మి ఒంటరితనంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతురాలి కొడుకు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రతీ ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలి

● మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి,ఆగస్టు17: సమాజంలో ప్రతి ఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని చావిడి గల్లీ పెద్ద హనుమాన్ మందిరంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, బీజేపీ నాయకులు యెండల లక్ష్మి నారాయణలు ముఖ్య అతిథిగా హజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ పోచారం మాట్లాడుతూ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో నేడు స్పాట్ అడ్మిషన్

పెర్కిట్, ఆగస్టు17: ఆర్మూర్ పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల (చీమన్‌పల్లి) నందు మిగిలిన సీట్లకు గాను ఆదివారం స్పాట్ అడ్మిషన్‌లు ప్రాంతీయ సమన్వయ అధికారి ఎన్.గంగారాం, ప్రిన్సిపాల్ సోమ్లా తెలిపారు.

మల్కాపూర్‌లో చిరుత కలకలం



దాడిలో చనిపోయిన మేక

సుభాష్‌నగర్, ఆగస్టు 17: నిజామాబాద్ రూరల్ మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. మల్కాపూర్ శివారులో మేకపై దాడి చేసి చంపివేసింది. దీంతో మల్కాపూర్ గ్రామ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. చిరుత దాడి చేయడం వల్లనే మేక చనిపోయినట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి ఉత్తర మండల ఎఫ్ఆర్‌వో సంజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న పాద ముద్రలను పరిశీలించి చిరుత పాదముద్రలు కావని ప్రజలు ఆందోళనకు గురి కావద్దని తెలిపారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా ఉండేందుకు గస్తీ నిర్వహిస్తామని ఎఫ్ఆర్‌వో తెలిపారు.

టీయూలో ఘనంగా తీజ్ వేడుకలు

డిచ్‌పల్లి,ఆగస్టు 17: తెలంగాణ విశ్వవిద్యాలయంలో తీజ్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారల ముఖ్య పండుగల్లో ప్రాధాన్యత సంతరించుకున్న తీజ్ వేడుకలను ఎస్సీ,ఎస్సీ సెల్ డైరెక్టర్ భ్రమరాంభిక ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించుకున్నారు. విద్యార్థినులు మహిళ ప్రొఫెసర్‌తో గోధుమలతో తయారైన బతుకమ్మలను తలపై పెట్టుకొని ర్యాలీగా ముందుకు సాగారు.ఈ కార్యక్రమంలో ప్రొ.శాంతదేవి, ప్రొ.కిరణ్ రాథోడ్, ప్రవీణ్ కుమార్, బీకోజీ నాయక్, నరేశ్ నాయక్, శ్రీనునాయక్, సాగర్ నాయక్, మో హన్, శ్రీకాంత్, చందర్, పాల్గొన్నారు.

మద్దెపల్లిలో తెలుగు పండిత్ పోస్టును భర్తీ చేయాలి

నవీపేట,ఆగస్టు17: మండలంలోని మద్దెపల్లి యుపీఎస్ పాఠశాలలో ఖాళీగా ఉన్న తెలుగు పండిత్ పోస్టును భర్తీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. శనివారం పాఠశాలలో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. మండలంలోని కమలాపూర్ యూపీఎస్ పాఠశాలకు చెందిన తెలుగు పండిత్ ఉపాధ్యాయురాలిని ఇటీవల నిజామాబాద్ మండలం బోర్గాం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించడం జరిగిందని, సంబంధిత ఉపాధ్యాయురాలిని మద్దెపల్లి యూపీఎస్‌కు కేటాయించాలని వారు కోరారు. ఈ విషయాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వీసీడీ అధ్యక్షుడు మద్దెపల్లి కిషన్‌రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, తదితరులున్నారు.

ఏసీబీ ట్రాప్‌పై శాఖాపరమైన విచారణ

ధర్పల్లి, ఆగస్టు 17: ధర్పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గతంలో పనిచేసిన సంధ్యారాణిని ఏసీబీ ట్రాప్ చేయడంతో శాఖాపరమైన విచారణను ప్రారంభించారు. శనివారం జిల్లా పంచాయతీరాజ్ అధికారి తరుణ్‌కుమార్, ఏసీబీ అధికారులు గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టారు. నవంబర్ 19, 2014లో కార్యదర్శిగా పనిచేసిన సంధ్యారాణి ఇంటి పర్మిషన్ నిమిత్తం గ్రామానికి చెందిన ఒకరిని డబ్బులు డిమాండ్ చేయడంతో ఏసీబీని ఆశ్రయించగా ఏసీబీ వలపన్ని కార్యదర్శి సంధ్యారాణిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శాఖపరమైన విచారణలో భాగంగా డీపీవో సంబంధిత కార్యదర్శితో పాటు బాధితులను వేరువేరుగా విచారించారు. విచారణలో భాగంగా వెలుగు చూసిన విషయాలపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ఈ విచారణలో ధర్పల్లి ప్రత్యేక అధికారి బాలకృష్ణ, ఈవో సైఫొద్దీన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాలల తనిఖీ

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 17: నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఖిల్లా, కోటగల్లి బాలికల జూనియర్ కళాశాలలను శనివారం డీఐఈవో రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ, ఆన్‌లైన్ నమోదు, ఇతర వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలల్లో అకాడమిక్, అడ్మిషన్ల తీరుపై సమీక్ష నిర్వహించారు. పచ్చదనం స్వచ్ఛదనం కింద మొక్కలు నాటాలని వాటిని పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి రోజు విద్యార్థులు కళాశాలలకు హాజరయ్యేలా చూడాలని అదేవిధంగా పూర్తి స్థాయిలో సిలబస్‌ను విద్యార్థులకు బోధించాలన్నారు.

ఎన్‌సీఎస్ఎఫ్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలి

- చెరుకు ఉత్పత్తిదారుల ప్రతినిధులు

ఖిల్లా, ఆగస్టు17 :ఎన్‌సీఎస్ఎఫ్ చక్కెర పరిశ్రమను వెంటనే తెరిపించాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్లు ఆకుల పాపయ్య, సిర్పనాగయ్యలు డిమాండ్ చేశారు. నగరంలోని అర్సపల్లిలో గల ఏఐకెఎంఎస్ ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో చెకుకు రైతుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది మంది రైతుల కుటుంబాల్లో, కార్మికుల కుటుంబాల్లో ఫ్యాక్టరీ వెలుగులు నింపిందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పూర్ భూమయ్య, మచ్చర్ల నాగయ్య, పృథ్వీరాజ్, నాయక్వాడీ నర్సయ్య, పెద్దహన్మాండ్లు, సాయరెడ్డి, కృష్ణగౌడ్, అబ్బు, ఎర్రన్న, చిన్నయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్, గంగాధర్, శివకుమార్, గంగాధర్, తదితరులు ఉన్నారు.

పెళ్లికి ఒక రోజు ముందు వరుడి ఆత్మహత్య

డిచ్‌పల్లి,ఆగస్టు 17: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన మాసిపెద్ది ప్రశాంత్ (28) ఆదివారం రోజు పెళ్లి జరగాల్సి ఉండగా రెండు రోజుల ముందు శుక్రవారం డిచ్‌పల్లి శివారులోని గాయత్రి ఎన్‌క్లేవ్‌లో పురుగుల మందుతాగి అపస్మరక స్థితిలో పడిపోయాడు కుటుంబీకులు సమాచారం చేరగా చికిత్స కోసం ప్రశాంత్ నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచాడు దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తాము ఏవరి కోసం బతకాలి, ఎందుకోసం బతకాలి అంటూ రోధించడం గ్రామస్థులను కంట తడిపెట్టించింది. డిచ్‌పల్లి పోలీస్‌లు ఆత్మహత్య ఘటనపై కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకొని దహనం చేసిన ప్రాంతాన్ని కూడా పరిశీలించామని పోలీసులు పేర్కొన్నారు. ఎస్సై మహేశ్ మాట్లాడుతూ... ఉద్యోగం రాలేదని బాధతోనే ప్రశాంత్ ఈ ఘటనకు పాల్పడినట్లు ప్రాథమిక విచా రనలో తేలిందని, ఆత్మహత్య చేసుకున్న ప్రశాంత్‌కు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే చికిత్స చేసి మృతదేహన్ని గుట్టు చప్పుడు గాకుండా కుటుంబ సభ్యు లకు అప్పగించిన ప్రైవేట్ ఆస్పత్రిపై కేసు నమోదు

20 నుంచి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

- జనవరి 6న తుది ఓటరు జాబితా
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్



వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అధికారి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 17: ఈనెల 20 నుంచి వచ్చే అక్టోబర్ 18 వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. అదనపు చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ లోకేష్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈనెల 20 నుంచి చేపట్టాల్సిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సూచనలు చేశారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి తిరుగుతూ ఓటరు జాబితా ప్రకారంగా పరిశీలన చేయాలని అన్నారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, అవసరమైన చోట వివరాల సవరణ చేయాల్సి ఉంటుందని, ఒకే చిరునామాపై ఎక్కువ మంది ఓటర్లు ఉన్నట్లయితే మరింత నిశిత పరిశీలన చేయాలన్నారు. వచ్చే అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. వీటిపై సవరణలు, అభ్యంతరాలను నవంబర్ 28 వరకు స్వీకరించాలని వాటిని డిసెంబరు 24లోపు పరిష్కరించాలన్నారు.వచ్చే 2025 జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఇంటింటా సర్వేచాలా ముఖ్యమని ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, సూపర్‌వైజర్లు పర్యవేక్షణలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటి సర్వే పకడ్బందీగా చేయాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహణపై నియోజకవర్గ స్థాయిలో మాస్టర్ ట్రైనర్స్ ద్వారా బీఎల్‌వోలకు అవగాహన తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ల వద్ద ఎలక్ట్రోరల్ జాబితా, పోలింగ్ స్టేషన్ మ్యాప్, వీఐపీ ఓటర్ల వివరాలు ఉండేలా చూడాలన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్లు తమ వద్ద ఉన్న బీఎల్‌వో యాప్‌లో ఓటర్ల వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సూచనలు, అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. ఓటు హక్కు నమోదు కోసం 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న యువత వివరాలను బూత్ లెవల్ అధికారుల ద్వారా ముందుగానే సేకరించాలన్నారు. ఈ వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రైతులను మోసం చేయాలని చూస్తోంది

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 17: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాప్రభుత్వం ఏర్పడిందని ప్రజలు ఆనందంగా ఉన్నారని ఆరు నెలల్లోనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నామని ఇది ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి విమర్శించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర అధ్యక్షుడు కేశవేణులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల్లోనే ఆరుగ్యారంటీలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే అది చూసి తట్టుకోలేక హరీశ్‌రావు, కెటిఆర్‌లు అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన జీవో విడుదల చేసిందని అందులో భూమి ఉండి దానిపై రుణం తీసుకున్న కుటుంబానికి రెండు లక్షల చొప్పున రుణమాఫీ చేస్తామని చెప్పడం జరిగిందని, నిర్ణీత గడువు 12-12-2019 నుంచి 9-12-2023 ఈ ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణం మాఫీ చేస్తామని మార్గదర్శకాలు ఇవ్వడం జరిగిందన్నారు. మొదటి విడతగా లక్ష రుణం, రెండవ విడతగా లక్షా 50వేల వరకు, మూడో విడతగా రెండు లక్షల రూపాయలు మాఫీ చేయడం జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇప్పటి వరకు రుణమాఫీ ఇంత పెద్ద మొత్తంలో జరగలేదని ఇది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే చేసిందన్నారు. రుణమాఫీలో ఎక్కడ కూడా అవినీతి జరగలేదని ఎవరికైతే రుణమాఫీ జరగలేదో వారి కోసం ప్రత్యేకంగా వ్యవసాయ అధికారులను నియమించడం జరిగిందని సమస్య వచ్చిన నెల రోజుల్లో పరిష్కరిస్తామని జీవోలో స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రుణమాఫీ చేయకపోగా రేషన్‌కార్డులు ఇవ్వలేదని రేషన్ కార్డు లేనివారికి రుణమాఫీ కాలేదన్నారు. ఇది బిఆర్ఎస్ చేసిన పాపమేనన్నారు. వివరాలు తప్పుగా నమోదై ఉంటే మాఫీ వర్తించలేదని వీటన్నింటిని త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అబద్ధపు మాటలను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీఆర్ఎస్ నాయకులకు గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పిన ఇంకా వారి తీరు మారలేదని ఇప్పటికైనా ప్రజలతో మమేకమై ఉండాలని ఆయన సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు రత్నాకర్, అంతిరెడ్డి రాజరెడ్డి, ముప్పగంగారెడ్డి, గడుగు రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ పలుచోట్ల బంద్



బంద్‌తో నిర్మానుష్యంగా మారిన ఆర్మూర్ పట్టణం

బోధన్‌రూరల్,ఆగస్టు17: బంగ్లాదేశ్‌లో హిందువులపై అఘాయిత్యాలను నిరసిస్తూ శనివారం బోధన్‌లో హిందు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇచ్చినబంద్ పిలుపుకు అన్ని వర్గాల నుండి సంపూర్ణ మద్దతు లభించింది. విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించడంతో బోధన్‌లో బంద్ విజయవంతమైందని హిందు సంఘాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. శనివారం బంద్‌లో భాగంగా నిరసనకారులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపైవిడిచిపెట్టారు.ఈ సందర్భంగా హిందు సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం ఇచ్చిన బంద్ పిలుపుకు అన్ని వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభించిందన్నారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్‌ల కోసం జరిగిన నిరసనలు క్రమంగా అక్కడ మైనారిటీలుగా ఉన్న హిందువులపై హత్యలు, అత్యాచారాలకు దారి తీయడం జరిగిందన్నారు. సాయంత్రం ఆరు గంటలకు బోధన్‌లో కొవ్వొత్తులతో శాంతిర్యాలీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హిందు సంఘాల ఐక్య వేదిక నాయకులు సుధాకర్‌చారి,బాలరాజు, రామరాజు, వినోద్,గోపికిషన్, లక్ష్మణ్ చౌహాన్, పులిసాయిలు,హరికృష్ణ,అరవింద్‌లతో తదితరులుపాల్గొన్నారు.

- బషీరాబాద్‌లో బంద్ సంపూర్ణం

కమ్మర్‌పల్లి: బంగ్లాదేశ్‌లో హిందువలుపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో వీడీసీ ఆధ్వర్యంలో బంద్ పాటించారు. శనివారం ఉదయం నుండే దుకాణాలు,వ్యాపార సంస్థలు స్వచ్ఛందగా మూసిఉంచారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఆనంద్, కార్యదర్శి రాములు,సదర్ బుచ్చన్న, రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- ధర్పల్లిలో బంద్ ప్రశాంతం

ధర్పల్లి: మండల కేంద్రంలో హిందూ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు శనివారం విజయవంతమైంది. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా బంద్‌కు పిలుపునిచ్చారు. ఉదయం నుంచిహోటళ్లు, దుకాణా సముదాయాలు,సినిమాహాళ్లు,పెట్రోల్‌బంక్‌లు మూసిఉం చారు.బంగ్లాదేశ్‌లోని హిందువులకు రక్షణకల్పించాలని డి మాండ్ చేశారు.

- ఆర్మూర్‌లో బంద్‌కు భారీ బందోబస్తు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ బంద్‌కు ఏసీబీ బస్వారెడ్డి ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌వో రవికుమార్ భారీ బందోబస్తు నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువుల మారణ కాండనకు నిరసనగా ప్రజా ఐక్య సమితి ఆధ్వర్యంలో శనివారం బంద్ నిర్వహించడంతో మామిడిపల్లిచౌరస్తా, అంబేద్కరచౌరస్తా, పెర్కిట్‌చౌరస్తాలతో పాటు రోడ్లపై ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలో ప్రజా ఐక్య సమితి ఆధ్వర్యంలో శనివారం బంద్ పిలుపు మేరకు పట్టణంలోని వాణిజ్యసంస్థలు, విద్యాసంస్థలుస్వచ్ఛందంగా బంద్ పాటించాయి.బంగ్లాదేశ్‌లో హిం దువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఇచ్చిన బంద్‌కు పలు పార్టీలు మద్దతు తెలిపాయి.

- ముప్కాల్, బాల్కొండలాల్లో బంద్ ప్రశాంతం

ముప్కాల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా హిందు ఐక్యవేదిక, జేఏసీ ఐక్యవేదికా ఆధ్వర్యంలో శనివారం బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో చేపట్టిన బంద్ సంపూర్ణంగా జరిగింది. వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు శాంతియుతంగా బంద్ పాటించారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.

బాధితుడి ఇంటిపై మరోసారి దాడి

ఖిల్లా, ఆగస్టు17 :నగరంలోని ఆటోనగర్‌కు చెందిన జునేద్ అనే యువకుడి ఇంటిపై శుక్రవారం అర్ధరాత్రి కొందరు యువకులు కత్తులతో, కర్రలతో దాడి చేసిన ఘటన ఆరవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. దాడి చేసిన సమయంలో బాధితుడు జునేద్ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రెండు రోజుల కితం నగరంలోని అహ్మద్ పురకాలనీలో జునేద్ అనే యువకుడిపై కొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయాలపాలయిన జునైద్ రెండవ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తిరిగి ఆ యువకుడిపై కక్ష పెంచుకున్న సదరు యువకులు అహ్మద్‌ఖాన్, అమన్‌మికర్జా, అసద్‌ఖాన్, మరి కొందరు దాడి చేశారు. ఆ సమయంలో జునైద్ ఇంటిలో లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. బాధితుడు తనకు రక్షణ కల్పించాలని ఆరవ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావ్ తెలిపారు.

- నగరంలో కొత్త గ్యాంగ్ వార్

నగరంలో కొత్త గ్యాంగ్ వార్ మొదలయింది. గతంలో ఉన్న గ్యాంగ్‌స్టర్‌లలో ముఖ్య అనుచరులు హత్యలకు గురికావడంతో కొంత కాలంగా గ్యాంగ్‌వార్‌కు ఫుల్‌స్టాప్ పడింది. తిరిగి శుక్రవారం ర్యాలీ విషయంలో కొందరు గ్యాంగ్‌లుగా ఏర్పడి పరస్పర దాడులు చేసుకుంటున్నారు.నగర ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.ఏసమయంలో ఏమి జరుగుతుందోనన్న భయం వారిలో ఆవహించింది. కొత్తగాఏర్పడ్డ గ్యాంగ్ ఇప్పటి వరకు స్నేహితులుగా ఉండి ర్యాలీ విషయంలో రెండుగా విడిపోయి దాడులకు దిగుతున్నారు. పోలీసు శాఖ అప్రమత్తమై వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే పరిస్థితి చేయిదాటిపోయే అవకాశాలు ఉన్నాయనిఅనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

చట్టాన్ని ఉల్లంఘించొద్దు : ఎస్సై

మోపాల్, ఆగస్టు 17: ప్రజలు నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మోపాల్ ఎస్సై యాదగిరి గ్రామస్తులకు సూచించారు. శనివారం మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కులాస్‌పూర్ గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ బుక్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని వాహనాలను అతివేగంగా నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. ప్రజలు వాహనాలు నడిపే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఎస్సై రమేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొరాయించిన రైల్వే గేటు

డిచ్‌పల్లి,ఆగస్టు 17 ఘన్‌పూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే గేటు శనివారం నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లిన తర్వాత రైలు వెళ్లగాను రైల్వే ఎలక్ట్రికల్ గేటును సిబ్బంది తీయగా కొంత సేపు మొరాయించ డంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రైల్వే సిబ్బంది వెంటనే గేటు ను చేయితో పైకేత్తి సరిచేయించారు.

శిఖం కబ్జాపై అధికారుల సీరియస్

- అక్రమ కట్టడాలను కూల్చివేసిన అధికారులు

సుభాష్‌నగర్, ఆగస్టు 17: నగర శివారులోని బొందం గడ్డ చెరువుపై అక్రమాలకు పాల్పడిన వారిపై అధికారులు సీరియస్ అయ్యారు. ఉదయం నుంచి జేసీబీలతో వెళ్లిఅక్రమ కట్టణాలను కూల్చివేశారు. నగరశివారులోని భారతిరాణి కాలనీ పక్కగల చెరువు శిఖం భూమిని కొందరు పెద్దలు కబ్జా చేసి ఆక్రమించారు. అంతేకాకుండా వాటిని నివాసాలుగా ఏర్పాటు చేశారు.శిఖంభూమి కబ్జాపై ఫిర్యాదులు అందుకున్న మున్సిపల్,రెవెన్యూశాఖల అధికారులు శనివారం ఉదయం అన్నిశాఖల సమన్వయంతో పాటు పోలీసుల ఆధ్వర్యంలో చెరువు శిఖంభూమిలో కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వాటిని జేసీబీలతో కూల్చివేయించారు.కూల్చివేతను అక్కడున్నస్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు.పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఎమ్.జి రోడ్ శాఖ (20110), ఆర్మూర్, నిజామాబాద్ జిల్లా

స్వాధీనతా ప్రకటన

రూల్ 8(1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కొరకు)
(SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13 (4) క్రింద ఆస్తి స్వాధీనానికి సంబంధించి ప్రకటన ప్రచురణ)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తంను మిమ్మల్ని చెల్లించవలసినదిగా కోరుతూ ప్రతి ఖాతాకు ఎదురుగా పేర్కొన్న తేదిన డిమాండ్ ప్రకటన జారీచేశారు.
సదరు మొత్తంను తిరిగి చెల్లింపుటలో న్యాయవారసులందరూ & ఇతరులు విఫలమైనందున, సదరు చట్టం యొక్క రూలు 9తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి /ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు స్వాధీనం చేసుకొన్నారని న్యాయవారసులందరూ & ఇతరులు మరియు సాధారణ ప్రజానీకానికి ప్రతి ఖాతకు ఎదురుగా పేర్కొన్న తేదిన నోటీసు ఇవ్వడమైనది.
సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదని ముఖ్యంగా న్యాయవారసులందరూ & ఇతరులు మరియు సాధారణ ప్రజానీకం హెచ్చరించబడుచున్నారు మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారమైనా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించుటకు లోబడి ఉంటాయి.

క్ర. సం.	రుణగ్రహీత/ హామీదారు/న్యాయ వారసుల పేరు :	ఆస్తుల వివరాలు/ తాకట్టు పెట్టబడిన సెక్యూర్డ్ ఆస్తుల చిరునామా:	డిమాండ్ నోటీస్ ప్రకటన తేదీ:	స్వాధీనత తేదీ:	బకాయి మొత్తం
1	రుణగ్రహీత: శ్రీ ఎల్లందుల వేణు, తండ్రి లక్ష్మీ నారాయణ చిరునామా 1): ఇ.నం.3-9, తిమ్మాపూర్ గ్రామం, మోర్తాడ్ మండలం, నిజామాబాద్ జిల్లా. చిరునామా 2): 1-1-307, వినాయక నగర్ (తెలంగాణ విగ్రహం సమీపాన) నిజామాబాద్ ఖాతా నం.: 39439731762 (గృహ రుణం)	డాక్యుమెంట్ నం. 3688/2020, తేది:24.06.2020 ప్రకారం శ్రీ ఎల్లందుల వేణు, తండ్రి సత్యనారాయణకు చెందిన ఆర్మూర్ సబ్ జిల్లా రిజిస్ట్రేషన్ మరియు నిజామాబాద్ రిజిస్ట్రేషన్ జిల్లా ఆర్మూరు మునిసిపాలిటీ, ఆర్మూరు మండలం యొక్క పెర్కిట్ గ్రామం వద్ద ఆర్‌సిసి రూఫ్ కలిగిన మొదటి అంతస్తు బిల్టప్ ఏరియా 1125.00 చ.అ.లు. మరియు ఆర్‌సిసి రూఫ్ కలిగిన గ్రౌండ్ ఫ్లోర్ బిల్టప్ ఏరియా 1125.00 చ.అ.లు, ప్లింత్ ఏరియాతో మొత్తం స్థలం ఏరియా 166.66 చ.గ.లు లేదా 139.35 చ.మీ.లు, సర్వే నం. 23/5/బి2 భాగంలో ఖాళీ ప్లాట్ నం. 10పై నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ సగం పూర్తయిన గ్రౌండ్ మరియు మొదటి అంతస్తుతో నివాసిత భవనం యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నం. 9, **దక్షిణం :** ప్లాట్ నం. 11, **తూర్పు :** 30'-00" వెడల్పు రోడ్, **పశ్చిమం:** హిస్సాపల్లి గంగారాం భూమి	05.06.2024	12.08.2024	తేది: 07.05.2024 నాటికి రూ.79,41,195/- (రూపాయలు డెబ్బై తొమ్మిది లక్షల నలభై ఒక్క వేల ఒక వంద తొంభై ఐదు మాత్రమే)+ వడ్డీ+ఛార్జీలు
2	రుణగ్రహీత: శ్రీ శ్రీరామ్ సాకేత్, తండ్రి శ్రీనివాస్, ఇ.నం.1-1-625, పద్మానగర్-2, నిజామాబాద్-503001 ఖాతా నం : 39916389191 (గృహ రుణం)	డాక్యుమెంట్ నం. 103/2021, తేది:04.01.2021 ప్రకారం శ్రీ శ్రీరామ్ సాకేత్, తండ్రి శ్రీనివాస్‌కు చెందిన ఆర్మూర్ సబ్ జిల్లా రిజిస్ట్రేషన్ మరియు నిజామాబాద్ రిజిస్ట్రేషన్ జిల్లా ఆర్మూరు మునిసిపాలిటీ, ఆర్మూరు మండలం యొక్క పెర్కిట్ గ్రామం వద్ద ఆర్‌సిసి రూఫ్ కలిగిన మొదటి అంతస్తు బిల్టప్ ఏరియా 1125.00 చ.అ.లు. మరియు ఆర్‌సిసి రూఫ్ కలిగిన గ్రౌండ్ ఫ్లోర్ బిల్టప్ ఏరియా 1125.00 చ.అ.లు, ప్లింత్ ఏరియాతో మొత్తం స్థలం ఏరియా 166.66 చ.గ.లు లేదా 139.35 చ.మీ.లు, సర్వే నం. 23/5/బి2 భాగంలో ఖాళీ ప్లాట్ నం. 3పై నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ సగం పూర్తయిన గ్రౌండ్ మరియు మొదటి అంతస్తుతో నివాసిత భవనం యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నం. 2, **దక్షిణం :** ప్లాట్ నం. 4, **తూర్పు :** 30'-00" వెడల్పు రోడ్, **పశ్చిమం:** హిస్సాపల్లి గంగారాం భూమి	05.06.2024	12.08.2024	తేది: 05.06.2024 నాటికి రూ.76,87,424/- (రూపాయలు డెబ్బై ఆరు లక్షల ఎనభై ఏడు వేల నాలుగు వందల ఇరవై నాలుగు మాత్రమే)+ వడ్డీ+ఛార్జీలు

తేది : 12.08.2024,
ప్రదేశం : ఆర్మూర్

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.